క్లుప్తంగా

ప్రకాశరావు మృతికి మంత్రి జోగి రమేష్ సంతాపం



పెడన: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, బంటుమిల్లి సమితి అధ్యక్షుడు సూర్య ప్రకాశరావు మృతి తీరని లోటని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. నల్లమోతు సూర్యప్రకాశరావు (90) సోమవారం రాత్రి మృతి చెందిన విషయం విదితమే. మంత్రి జోగి రమేష్ బుధవారం ఉదయం చేవేంద్ర గ్రామంలో ప్రకాశరావు ఇంటి వద్ద సూర్యప్రకాశరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, డెప్యూటీ మాజీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

రంగా విగ్రహం ఏర్పాటుకు పంచాయతీ అనుమతి

నాగాయలంక: దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా విగ్రహం నాగాయలంకలో ఏర్పాటు చేసుకునేందుకు స్థానిక పంచాయతీ పాలకవర్గం అనుమతి ఇచ్చింది. విగ్రహాన్ని మెయిన్ సెంటర్‌లోని తోట రాధాకృష్ణమూర్తి బిల్డింగ్ ఎదుట ఎవరికీ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకునేందుకు పాలకవర్గం ఆమోదించింది. తీర్మానం కాపీని సంఘం అధ్యక్షుడు భోగాది సోమశేఖర్ (చిన్నారి), ఉపాధ్యక్షుడు తోట శ్రీనివాసరావు తదితర సంఘ నాయకులకు కార్యదర్శి అందజేశారు. అయితే జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకోవాలని సూచిస్తూ తీర్మానంలో గ్రామ కార్యదర్శి నోట్ పొందుపర్చారు.

వైఎస్సార్ బీమా అందజేత

కోడూరు: కోడూరుకు చెందిన బొర్రా శ్రీను ఇటీవల మృతిచెందాడు. వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10 వేల నగదును బుధవారం మృతుడి కుటుంబ సభ్యులకు సర్పంచి వెన్నా షైనీ అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



కోడూరు: స్వతంత్రపురం జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం తీరును స్థానిక ప్రజాప్రతినిధులు బుధవారం పరిశీలించారు. వంటలను రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని, నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వసతులపై ఆరా తీశారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, ఈఓపీఆర్డీ నాగదేవతి పాల్గొన్నారు.

పృథ్వీశ్వర స్వామి హుండీ కానుకల లెక్కింపు

నడకుదురు(చల్లపల్లి):నడకుదురులోని ప్రాచీన పుణ్యక్షేత్రం పృథ్వీశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం హుండీ కానుకలను లెక్కించారు. దేవదాయ శాఖ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సుధాకర్ పర్యవేక్షణలో హుండీ తెరిచి కానుకలను లెక్కించారు. మూడు నెలలకు హుండీ ద్వారా రూ.1,70,809 ఆదాయం లభించింది. కార్యక్రమాన్ని డ్రెస్ కోడ్ పాటిస్తూ దేవస్థానం ఈఓ యార్లగడ్డ వాసు, సర్పంచ్ గొరిపర్తి సురేష్‌బాబు, సజ్జా బలరాం, మల్లుపెద్ది త్రివిక్రమరావు, ఆలయ అర్చకులు పర్యవేక్షించారు.

అయ్యప్పస్వామికి వేద స్వస్తి



మచిలీపట్నంటౌన్: స్థానిక గాంధీబొమ్మ శివాలయం ఆవరణలోని అయ్యప్ప దేవాలయంలో బుధవారం అయ్యప్ప స్వామికి వేదస్వస్తి నిర్వహించారు. ఆగిరిపల్లికి చెందిన శోభనాద్రి లక్ష్మీ నరసింహస్వామి వేదశాస్త్ర పాఠశాలకు చెందిన 33 మంది వేద విద్యార్థులు, అధ్యాపకులు విచ్చేసి వేదస్వస్తి జరిపారు. అయ్యప్ప మాల ధారులకు అన్నసేవ నిర్వహించారు. లక్ష్మీగణపతి హోమం, మహాభిషేకాలు జరిగాయి. ఈ నెల 17న ఆలయ ప్రాంగణంలో భక్తి సంకీర్తన పోటీలు నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు

మేలు చేస్తున్న జగన్‌ను ఆశీర్వదించండి

- మేయర్ వెంకటేశ్వరమ్మ
- పలు ప్రాంతాల్లో ఏపీకి జగనే ఎందుకు కావాలి
- సంక్షేమ పథకాల బోర్డుల ఆవిష్కరణ





కమ్మనమోలులో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు; బందరులో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన మేయర్ వెంకటేశ్వరమ్మ తదితరులు

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ప్రజలందరూ ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ఉందని నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. 46వ డివిజన్‌లో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నివర్గాల ప్రజలను ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా విద్య, వైద్య రంగాలను బలోపేతం చేసి మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారన్నారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేసి జగనన్న విద్యా కానుక, ఇంగ్లిష్ మీడియం, పౌష్టికాహారం అందిస్తూ పేదలకు మంచి విద్యను అందిస్తున్నారని చెప్పారు. ఆస్పత్రులను అభివృద్ధి చేసి అన్ని రకాల మందులను ఉచితంగా అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ఇటీవల జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారని చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం రూ. 25 లక్షల మేర పొందేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను, డివిజన్‌లో జరిగిన అభివృద్ధి వివరాల బోర్డును మేయర్ వెంకటేశ్వరమ్మ ఆవిష్కరించారు. కార్పొరేటర్ భోగాది సాయిబాబు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, డెప్యూటీ మేయర్ శీలం భారతి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ గూడవల్లి నాగరాజు, కార్పొరేటర్లు మాచవరపు రాంప్రసాద్, పల్లి సింహాచలం, వైఎస్సార్ సీపీ నాయకులు ధనికొండ శ్రీనివాసరావు, సత్తెనపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేదల జీవనంలో గొప్ప మార్పు..

కమ్మనమోలు(నాగాయలంక): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేదల జీవనంలో గొప్ప మార్పు వచ్చిందని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది వెంకట నారాయణ (చిన్నారి), వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి, పల్లెకు పోదాం కార్యక్రమాలు బుధవారం కమ్మనమోలు సచివాలయం పరిధిలో నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. సర్పంచి సనకా మురళీకృష్ణ, ఈఓపీఆర్డీ కె.అప్పల నరసమ్మ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ముమ్మారెడ్డి సాంబశివరావు, బీమా బాబూరావు, విశ్వనాథపల్లి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కోకనారాయణపాలెంలో సంక్షేమ బోర్డు ఆవిష్కరించిన నాయకులు

- గూడూరు: కోకనారాయణపాలెం గ్రామ సచివాలయంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు, వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ గూడూరు మండల కన్వీనర్ పర్ణం పెదబాబు, సర్పంచులు బండి అంజలి కుమారి, జంపన రమాదేవి, ఆర్బీకే చైర్మన్ కొల్లు శివ, రాయవరం పీఏసీఎస్ చైర్మన్ కోళ్ల బాలకృష్ణ, నాయకులు జక్కా రాజేష్, జంపన అవినాష్, వేమూరి స్వామి నాయుడు, మేడా అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలమ్మా.. పోయిరావమ్మా

కార్తిక దామోదరుడికి ఘన వీడ్కోలు



మోపిదేవిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



నాగులేరులో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



బంటుమిల్లి శివాలయం ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు



కోడూరులో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



నాగాయలంక కృష్ణానది ఒడ్డున ఘాట్‌లో..



పోలి దీప కాంతులతో నాగాయలంకలో కృష్ణమ్మ



రామరాజు చానల్‌లో దీపాలు వదులుతున్న భక్తులు

కోడూరు: కార్తికమాసం ముగింపును పురస్కరించుకొని కార్తిక దామోదరుడికి భక్తులు ఘన వీడ్కోలు పలికారు. బుధవారం వేకువజామునే సమీప కాలువలు, నదుల వద్ద మహిళలు పరమశివుడికి, పార్వతి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. అరటిదొప్పల్లో కార్తిక దీపాలను వెలిగించి వాటిని కాలువలు, నదుల్లో వదిలి భక్తిభావం చాటుకున్నారు. కోడూరు నుంచి అవనిగడ్డ వరకు ప్రధాన పంటకాలువ వద్దకు మహిళలు కార్తిక దామోదరుడికి వీడ్కోలు పలికేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వి.కొత్తపాలెం, జయపురం, విశ్వనాథపల్లి, నాయుడుపేట, వంతెన సెంటర్ వద్ద మహిళల కోలాహలం కనిపించింది. లింగారెడ్డిపాలెంలోని గోకర్ణేశ్వరస్వామి వారి ఆలయం పక్కన నీటి ప్రవాహంలో మహిళలు దీపాలను వదిలారు. శైవక్షేత్రాల్లో కార్తికమాస ముగింపు పూజలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు.

- నాగాయలంక: నాగాయలంక, మర్రిపాలెం, రేమాలవారిపాలెం, వక్కపట్లవారిపాలెం, తలగడదీవి, నంగేగడ్డ, భావదేవరపల్లి, చోడవరం, కోడూరు మండలం మందపాకల, పోటుమీద తదితర గ్రామాల నుంచి వేలాదిమంది భక్తులు నాగాయలంక కృష్ణాతీరంలో శ్రీరామ పాదక్షేత్రం పుష్కర ఘాట్ వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం అరటి దొప్పల్లో దీపాలు వెలిగించి పోలిని సాగనంపారు. క్షేత్రంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.
- పెడన: పెడన–మచిలీపట్నం రోడ్డులోని రామరాజు చానల్ వద్ద భక్తులు విఘ్నేశ్వరస్వామిని పూజించి శివపార్వతులను ఆరాధిస్తూ దీపాలను వెలిగించి కాలువలోకి వదిలి పోలిని స్వర్గానికి సాగనంపారు. కొందరు ఇళ్ల వద్దే దీపారాధన చేశారు.
- కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారికి ఉదయం 5 గంటలకు ప్రత్యేక వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు. సమీపంలోని బొబ్బర్లంక వద్ద కృష్ణానది వరకు ఊరేగింపుగా వెళ్లి నదిలో అవభృథస్నానం చేసిన అనంతరం పోలిని స్వర్గానికి పంపారు. అరటి దొప్పలలో దీపారాధనలు చేసి పోలిని సాగనంపారు.
- బంటుమిల్లి: కార్తికమాసం ముగియడంతో బుధవారం తెల్లవారుజామున మండలంలోని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు వెలిగించి పోలిని స్వర్గానికి పంపారు. మల్లేశ్వరం గ్రామం వద్ద బంటుమిల్లి ప్రధాన కాలువ కట్ట భక్తులతో కిటకిటలాడింది. పలు గ్రామాలకు చెందిన భక్తులు తెల్లవారుఝామున పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులు విడిచిపెట్టిన దీపాల కాంతులతో పంట కాలువ వెలుగులు నింపుకుంది.
- మచిలీపట్నంటౌన్: కార్తిక మాసం చివరి ఘట్టంలో భాగంగా బుధవారం పోలి స్వర్గం కార్యక్రమాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని పలు శివాలయాలతో పాటు నాగులేరు కాలువలో వందలాది మంది భక్తులు అరటిదొప్పల్లో దీపాలు వెలిగించి నాగులేరు కాలువలో వదిలి పోలిని స్వర్గానికి సాగనంపారు. తొలుత నాగులేరులో స్నానాలు ఆచరించి దీపారాధన చేశారు. ఆలయ ప్రాంగణాలు, నాగులేరు కాలువగట్టు బుధవారం తెల్లవారు జామున భక్తులతో కిటకిటలాడాయి. నగరంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలోని మహాశివుని విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన పెద్ద తొట్టెలో భక్తులు దీపాలు వెలిగించారు. నాగులేరు గట్టుపై ఉన్న రసలింగేశ్వరస్వామి వారి దేవాలయంలో, గాంధీబొమ్మ శివాలయం, గొడుగుపేట, బచ్చుపేట శివాలయాలు, ఈడేపల్లి జోడుగుళ్ల, ఖొజ్జిల్లిపేట, చింతగుంటపాలెం నాగేశ్వర స్వామి దేవస్థానాలు, మాచవరం శివాలయాల్లో భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు.

'ఆడుదాం ఆంధ్రా' కిట్ల పంపిణీ



అవనిగడ్డలో క్రీడా సామగ్రిని అందిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ



స్వతంత్రపురం పాఠశాలలో సచివాలయ సిబ్బందికి కిట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కోడూరు: 'ఆడుదాం ఆంధ్రా'కు సంబంధించిన కిట్లను మండలంలోని 11 సచివాలయాలకు జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. స్వతంత్రపురం జెడ్పీ పాఠశాల వద్ద కిట్లను సచివాలయ సిబ్బందికి అందించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్ పాల్గొన్నారు.

- ఘంటసాల(అవనిగడ్డ): ఆడుదాం ఆంధ్రా క్రీడా సామగ్రిని ఎంపీపీ వేమూరి రజనీకుమారి సచివాలయాలకు అందజేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, ఎంపీడీఓ అనూహ్య, తహసీల్దార్ బి. రామానాయక్ తదితరులు పాల్గొన్నారు.
- బంటుమిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ వి. చినబాబు, ఎంపీడీఓ జె. స్వర్ణభారతి, ఎంఈఓ–1 త్రిపుర సుందరీదేవీలు సచివాలయాల కార్యదర్శులకు ఆడుదాం ఆంధ్రా కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 వెంకటేశ్వరరావు, పీడీ మోహన్‌రావు, ఈఓ దాసరి శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.
- కృత్తివెన్ను: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్, జెడ్పీటీసీ మైల రత్నకుమారిలు ఆడుదాం ఆంధ్రా కిట్లను సచివాలయాల కార్యదర్శులకు బుధవారం అందించారు. ఈ నెల 15 నుంచి సచివాలయాల పరిధిలో ఆటల పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వైదాని వెంకట్రాజు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కొక్కిలిగడ్డ బాపూజీ, ఎంపీడీఓ పిచ్చిబాబు, ఎంఈఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ నిర్వహణపై అవగాహన



మాక్ పోల్ నిర్వహణపై మాట్లాడుతున్న డీఆర్వో పెద్ది రోజా

చిలకలపూడి(మచిలీపట్నం): ఓటరుగా నమోదై ఓటు హక్కును పొందటం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా అన్నారు. పద్మావతి మహిళా కళాశాలకు చెందిన డిగ్రీ విద్యార్థినులకు మాక్ పోలింగ్ నిర్వహణ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచనల మేరకు 18 ఏళ్ల వయసు దాటిన వారందరూ ఓటరుగా నమోదై ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఇందుకోసం ఓటరుగా నమోదు కాని వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. ఓటు హక్కుపొందిన వారు ఎన్నికల్లో ఓటు హక్కును ఎలా వినియోగించాలో ఆమె వివరించారు. ఈవీఎం, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ల పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తొలుత కంట్రోల్ యూనిట్ ద్వారా ఈవీఎంలో ఏర్పాటు చేసిన అభ్యర్థుల వివరాల ప్రకారం ఓటు ఎవరికి వేయాలనుకున్నారో ఆ పేరు వద్ద బటన్ నొక్కాలన్నారు. ఎవరికి ఓటు వేశారో తెలుసుకునేందుకు వీవీప్యాట్‌లో ఏడు సెకండ్ల సమయంలో చూసుకునేందుకు వీలు ఉంటుందని చెప్పారు. ఈ ప్రక్రియ అంతా ఒక క్యాబిన్‌లో ఏర్పాటు చేస్తారని, మీ ఓటు ఎవరికి వేశారో మీకు తప్ప మిగిలిన వారికి తెలియదని వివరించారు. ఇందుకోసం అర్హత ఉన్న ప్రతిఒక్కరు ఓటరుగా నమోదై ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం. సురేష్, డెప్యూటీ తహసీల్దార్ ఎంవీ శ్యామ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఓలు విధులను సక్రమంగా నిర్వహించాలి

ప్రత్యేక పరిశీలకుడు శ్రీధర్

పెనమలూరు: ఓటర్ల జాబితా విషయంలో బూత్ లెవల్ అధికారులు అప్రమత్తంగా ఉండి విధులు సక్రమంగా నిర్వహించాలని ఓటర్ల జాబితా సవరణ జిల్లా ప్రత్యేక పరిశీలకుడు, ఏపీ కాలుష్య నివారణ మండలి కార్యదర్శి బి.శ్రీధర్ అన్నారు. ఆయన బుధవారం తాడిగడప, పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, పెనమలూరు పల్లిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పుల వివరాలను బూత్ లెవల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బూత్ లెవల్ అధికారులు సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. మృతిచెందిన ఓటర్ల వివరాలతో పాటు డబుల్ ఎంట్రీ ఓటర్లను గుర్తించి తొలగించాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువ ఓటర్లకు ఓటు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఓటర్లను గతంలో వారికి ఉన్న ఓటు విషయమై తనిఖీ చేయాలన్నారు. బూత్ లెవల్ అధికారులు నిబంధనల ప్రకారమే పని చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య, తాడిగడప కమిషనర్ ప్రకాశరావు, డీటీ భవాని, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

పెడన: ఇంటి నుంచి బయటకు వెళ్లిన భర్త తిరిగి రాలేదని ఓ మహిళ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందమూరు గ్రామ పంచాయతీ జయంతి కాలనీకి చెందిన పామర్తి వెంకట నాగేశ్వరరావు (47) లారీ డ్రైవర్. భార్య అంజనాదేవితో కలిసి జీవిస్తున్నాడు. ఈ నెల 11వ తేదీన ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన భర్త తిరిగి రాలేదు. తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద విచారణ చేసినా ఫలితం లేకపోవడంతో నాగేశ్వరరావు భార్య అంజనాదేవి పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు పెడన ఎస్ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేశారు.

ఆకట్టుకుంటున్న స్వెట్టర్ సాయిబాబా



బందలాయిచెరువు(అవనిగడ్డ): మండల పరిధిలోని బందలాయిచెరువులో షిర్డీ సాయిబాబా స్వెట్టర్‌తో దర్శన మిచ్చారు. గత రెండు రోజులుగా చలి పెరిగింది. దీంతో సాయంత్రం వేళ బందలాయిచెరువులోని షిర్డీ సాయి జ్ఞానమందిర నిర్వాహకురాలు సాయిబాబా విగ్రహానికి స్వెట్టర్‌ను అలంకరించి ఉదయం తీసి ప్రత్యేక అలంకరణ చేస్తోంది. ప్రధాన రహదారి పక్కనున్న ఈ మందిరంలో సాయి విగ్రహం స్వెట్టర్‌తో దర్శనమివ్వడంతో పలువురు ఆసక్తిగా తిలకించి బాబాకు నమస్కరించి వెళుతున్నారు.

నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేస్తాం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, చిత్రంలో కడవకొల్లు తదితరులు

అవనిగడ్డ: మిచాంగ్ తుపానుకు నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అధికారులకు సూచించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులతో బుధవారం ఎమ్మెల్యే సింహాద్రి సమీక్ష నిర్వహించారు. తుపానుకు నీట మునిగిన, పడిపోయిన పంటలను జాగ్రత్తగా నమోదు చేయించాలన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం జరిగేలా చూడాలని చెప్పారు. ఇచ్చిన గడువు తేదీ లోగా నష్టం నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. పంట దెబ్బతిన్న ప్రతి రైతుకూ న్యాయం చేసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌మోన్‌రెడ్డి భరోసా ఇస్తున్నారని చెప్పారు. నష్టం నమోదుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు ఏర్పాట్లు పూర్తి

పెడన: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం విజయవంతం చేసేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావు అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై పెడన రూరల్‌తో పాటు పట్టణానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు, గ్రామ, వార్డు సచివాలయాల అడ్మిన్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే క్రికెట్, బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ ఆటలకు సంబంధించిన కిట్లను అన్ని సచివాలయాలకు అందజేశామని చెప్పారు. తహసీల్దార్ పి మధుసూదనరావు మాట్లాడుతూ పెడన మండలంలో క్రీడాకారుల సంఖ్యను పెంచాలన్నారు. ఈ నెల 15 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. సమావేశంలో సర్పంచ్‌ల సంఘం పెడన మండల అధ్యక్షుడు దావు బైరవలింగం, ఎంపీడీఓ రెడ్డయ్య, ఎంఈఓ హరనాథ్, పెడన పీహెచ్‌సీ వైద్యాధికారి పర్వేజ్ హైదర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు పాల్గొన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి పెడన నియోజకవర్గానికి ఎస్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ముదిగొండ ఫణి దూర్జిటిని ప్రత్యేక అధికారిగా నియమించారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా జయగోపాల్



అవనిగడ్డ: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా అవనిగడ్డకు చెందిన గాజుల జయగోపాల్ (గోపి)ని నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని బుధవారం ఆయనకు పంపించారు. గతంలో అవనిగడ్డ ఉప సర్పంచ్‌గా పనిచేశారు. మండలంలో జరిగే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. పార్టీ కోసం పనిచేస్తున్న వ్యక్తిని గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ యూత్ స్టేట్ జాయింట్ సెక్రటరీ చేయడం పట్ల జయగోపాల్ కృతజ్ఞత తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, తనకు పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావుకు గోపి కృతజ్ఞతలు తెలిపారు.

పైడమ్మ జాతర దుకాణాల వేలం

పెడన: పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 26 నుంచి 2024 జనవరి 5వ తేదీ వరకు జరగనున్నాయి. జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ మార్గంలో పురపాలక సంఘ పరిధిలో దుకాణాల ఏర్పాటుకు, దుకాణాల నుంచి రుసుం వసూలు చేసుకునేందుకు నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా పురపాలక సంఘానికి రూ.5.21 లక్షలు ఆదాయం వచ్చిందని ఇన్‌చార్జి కమిషనర్, టీపీఓ వి. ఏసుబాబు అన్నారు. బహిరంగ వేలం పాటలో ఆరుగురు పాల్గొన్నారని, హెచ్చుపాటదారుడు శివప్రసాద్‌కు పాటను ఖరారు చేశామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యోగేశ్వరరావు, ఆర్ఐ వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్లు నాగేశ్వరరావు, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

మోపిదేవి: తుపానుకు దెబ్బతిన్న పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేస్తున్నామని మండల వ్యవసాయాధికారి హెబ్సిబారాణి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం దెబ్బతిన్న పంట పొలాలను ఆమె పరిశీలించారు. పంట దెబ్బతిన్న రైతులు తమ పొలాలకు చెందిన పత్రాలను గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులకు అందించాలని కోరారు. అధికారులు పంట నష్టాన్ని ఈనెల 18వ తేదీ వరకు నమోదు చేస్తారని చెప్పారు.